# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 28 సోమవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 101

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# ఫాంహౌస్‌లో పార్టీ రగడ

**భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజ్ పాకాలకు చెందిన ఫాంహౌస్‌లో జరిగిన పార్టీపై పోలీసులు దాడి చేసి కేసులు పెట్టడం రాజకీయంగా దుమారం రేపింది. పార్టీలో పాల్గొన్న రాజ్ స్నేహితుడు మద్దూరి విజయ్ (56) కొకైన్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది.**

**దివాలీ పేరుతో నిర్వహించిన కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల**

- ఆయన స్నేహితుడికి కొకైన్ పరీక్షలో పాజిటివ్
- ఇద్దరిపైనా పలు కేసుల నమోదు
- పన్ను చెల్లించని మద్యం, పేకముక్కలు, కాయిన్ల పట్టివేత
- కేటీఆర్ ఇద్దరు బావమరుదుల ఇళ్లలోనూ సోదాలు
- అడ్డుకోబోయిన భారాస నేతలు.. తీవ్ర ఉద్రిక్తత..
- రాత్రి వరకు కొనసాగిన తనిఖీలు

హైదరాబాద్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది పాకాల రాజేంద్రప్రసాద్ అలియాస్ రాజ్ పాకాలకు చెందిన ఫాంహౌస్‌లో జరిగిన పార్టీపై పోలీసులు దాడి చేసి కేసులు పెట్టడం రాజకీయంగా దుమారం రేపింది. పార్టీలో పాల్గొన్న రాజ్ స్నేహితుడు మద్దూరి విజయ్ (56) కొకైన్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. రాజ్ పాకాల ఇచ్చినందుకే తాను డ్రగ్స్ తీసుకున్నట్లు విజయ్ పోలీసులకు వాంగ్మూలమిచ్చారు. సోదాల సందర్భంగా పన్ను చెల్లించని 12 విదేశీ మద్యం సీసాలు, సుంకం చెల్లించని దిల్లీ, మహారాష్ట్ర మద్యం, పేకముక్కలు, క్యాసినోల్లో వినియోగించే కాయిన్స్ 4 సూట్‌కేసుల్లో ఉండగా స్వాధీనం చేసుకున్నారు. రాజ్ పాకాల, మద్దూరి విజయ్‌లపై మోకిల పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్ట్‌తోపాటు గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్, భారాస నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు హోరెత్తాయి. నిజానిజాలు నిగ్గు తేల్చాలంటూ భాజపా డిమాండ్ చేసింది. కుటుంబపరంగా నిర్వహించుకున్న సాధారణ విందుపై దుష్ప్రచారం చేసి కేసులు పెట్టడం రాజకీయ కక్ష సాధింపు అని కేటీఆర్, హరీశ్‌రావులు ధ్వజమెత్తారు. ఫాంహౌస్ ఘటన అనంతరం.. రాయదుర్గంలోని కేటీఆర్ బావమరుదులు రాజ్ పాకాల, శైలేంద్రల నివాసాల్లో ఆదివారం పోలీసులు, ఆబ్కారీ అధికారులు నిర్వహించిన తనిఖీలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న భారాస నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు హైడ్రామా కొనసాగింది. 21 మంది పురుషులు.. 14 మంది మహిళలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్ పాకాల హైదరాబాద్‌లో ఈటీజీ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. ఈయనకు శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామ పరిధిలో శ్రీ మాత్రే ప్రాపర్టీస్‌లో ఫాంహౌస్ ఉంది. ఇక్కడ వారాంతాల్లో తరచూ మద్యం పార్టీలు నిర్వహిస్తుంటారు. దీపావళి నేపథ్యంలో తన ఫాంహౌస్‌లో 26న సాయంత్రం 'దివాలీ పార్టీ' ఏర్పాటు చేస్తున్నట్లు రాజ్ పాకాల తన సన్నిహితులకు ఇటీవల సమాచారం అందించారు. రాజ్ స్నేహితుడైన మద్దూరి విజయ్ సహా మొత్తం 21 మంది పురుషులు, 14 మంది మహిళలు దీనికి హాజరయ్యారు. అక్కడ విదేశీ మద్యం, డ్రగ్స్‌తో కూడిన పార్టీ జరుగుతున్నట్లు మాదాపూర్ ఎస్‌వోటీ, మోకిల పోలీసులు, ఆబ్కారీ అధికారులకు సమాచారం అందడంతో వారు శనివారం రాత్రి 11.30 గంటలకు ప్రత్యేక బృందాలతో సోదాలు చేశారు. పోలీసులను చూసి కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించినా పట్టుబడ్డారు.

## కేటీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే
# ధైర్యం లేకనే ఈ కుట్రలు



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వారి కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. జన్వాడ్ ఫామ్‌హౌస్ ఘటనపై స్పందించారు. మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బురదజల్లడంలో భాగంగానే కేటీఆర్ బావమరిదిపై రాజ్‌పాకలపై డ్రగ్స్ కేసంటూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు ఇది పరాకాష్ట. ప్రజల దృష్టి మళ్లించేందుకు సృష్టించేందుకే జన్వాడ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తోంది. రాజ్ పాకాల నివాసంలో ఫ్యామిలీ ఫంక్షన్ ఉన్నదని ముందుగానే ప్రభుత్వ పెద్దలకు తెలుసు. గత రెండు రోజుల నుంచి రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం శని, ఆదివారాల్లో బాంబులు పేలుతాయని అనడం, చెప్పినట్లుగానే ఇళ్లపై దాడులు చేయడం చూస్తే, ముందస్తు ప్రణాళికగా ఇది ప్రభుత్వం రూపొందించిన స్కెచ్ అని స్పష్టం అవుతోంది. ఫ్యామిలీ ఫంక్షన్‌పై దాడిచేసి దాన్ని రేవ్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. వృద్ధులు, చిన్నపిల్లలు, భార్యాభర్తలు ఉన్న ఫ్యామిలీ ఫంక్షన్‌ను డ్రగ్స్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్, ఆయన సతీమణి గానీ ఆ ఫ్యామిలీ ఫంక్షన్‌కి వెళ్లకపోయినా వెళ్లినట్టు చిత్రీకరించడం దారుణం, కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్య తప్ప మరేమీ కాదు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగవద్దని, నిజాయితీగా ఉన్నది ఉన్నట్టు చెప్పాలని, వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా ప్రవర్తించవద్దని నా విజప్తి. రోజురోజుకు ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుంచి దృష్టిమళ్లించేందుకే ఈ డ్రామా ఆడుతున్నారు.

రాజకీయాల్లో నేరుగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకొని చీప్ పాలిటిక్స్ చేయడం మానుకోవాలని హెచ్చరిస్తున్నాను.



# సదర్ ఉత్సవాలు

హైదరాబాద్ :కాంగ్రెస్ ప్రభుత్వం సదర్ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఇక నుంచి ఏటా సదర్ సమ్మేళనం అధికారికంగా నిర్వహించాలని ఇదే వేదిక నుంచి ప్రభుత్వ అధికారులను ఆదేశిస్తున్నానని ప్రకటించారు. "ఈ ఉత్సవాలను నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం. సదర్ అంటే యాదవుల ఖదర్. దీన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి. యాదవులు రాజకీయంగా ఎదగాలని అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపించాం. రాబోయే రోజుల్లోనూ అందరికీ సముచిత స్థానం కల్పిస్తాం. యాదవ సోదరుల అండదండలు ఉన్నందునే ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని గర్వంగా చెబుతున్నా.

## నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు కానీ
# విజయ్ పవర్‌ఫుల్ స్పీచ్



చెన్నై: "నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అని నటుడు విజయ్ అన్నారు. సినీ రంగంతో పోలిస్తే రాజకీయ రంగం చాలా సీరియస్ అని పేర్కొన్నారు. విల్లుపురం సమీపంలో నిర్వహించిన తమిళగ వెట్రి కళగం పార్టీ మొదటి మహానాడులో ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలతోపాటు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సభకు వేలాదిమంది అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. కెరీర్‌ని పీక్‌లో వదిలేసి రాజకీయాల్లోకి వచ్చా..

తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడిగా విజయ్ తమ పార్టీ భావజాలాన్ని, సిద్ధాంతాలను ప్రకటించారు. "ద్రవిడ, తమిళ జాతీయవాద సిద్ధాంతాలను అనుసరిస్తాం. తమిళనాడు గడ్డకు ఇవి రెండు కళ్లలాంటివి. లౌకిక, సామాజిక న్యాయ సిద్ధాంతాలే మా భావజాలం. వాటి ఆధారంగానే పని చేస్తాం. పెరియార్ ఈవీ రామస్వామి, కె.కామరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్, వేలు నాచియార్, అంజలి అమ్మాళ్ ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తాం. రాజకీయాల్లో ఫెయిల్యూర్స్, సక్సెస్ స్టోరీలు చదివాక.. నేను నా కెరీర్‌ని పీక్‌లో వదిలేసి మీ అందరిపై అచంచలమైన విశ్వాసాన్ని ఉంచి మీ విజయ్‌గా ఇక్కడ నిలబడ్డా. రాజకీయ అనుభవం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ అమితమైన ఆత్మవిశ్వాసంతో మనం సర్పం (రాజకీయం)తో ఆడుకునే పిల్లల్లాంటివాళ్లం" అన్నారు. విమర్శలకు చెక్ పెట్టి.. పొత్తులపై క్లారిటీ..

భాజపా నిరంకుశత్వంతో వ్యవహరిస్తుందని విమర్శించిన విజయ్.. డీఎంకే ద్రవిడియన్ నమూనాపైనా విరుచుకుపడ్డారు. తన రాజకీయ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆయన.. అరియలూరులో నీట్ విద్యార్థిని అనిత ఆత్మహత్య ఉదంతాన్ని గుర్తు చేస్తూ నీట్‌పై తమ పార్టీ వ్యతిరేక వైఖరిని ఈ సందర్భంగా ప్రకటించారు. తనను ఆర్టిస్ట్ అంటూ పలువురు చేస్తోన్న విమర్శలకు దీటుగా బదులిచ్చారు. 'సినిమా కెరీర్‌లో అత్యున్నత స్థాయిని వదిలేసి ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చా. నేను సినిమాల్లోకి వచ్చినప్పుడు కూడా నన్ను అవమానించారు. అయినా, కఠోర శ్రమ, ధైర్యంతో ఈ స్థాయికి చేరుకున్నా. ఎంజీఆర్, ఎన్టీఆర్ సైతం ఇదే విధమైన విమర్శలను ఎదుర్కొన్నారు. కానీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారు ప్రభంజనం సృష్టించారు. ప్రతి ఓటు ఎంతో శక్తిమంతమైనది.. మా పార్టీ తమిళనాడు రాజకీయాలపై బలమైన ప్రభావం చూపుతుంది" అన్నారు. పొత్తులపై మాట్లాడుతూ.. "రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మమ్మల్ని పూర్తిస్థాయి మెజార్టీతో గెలిపిస్తారని పూర్తిగా విశ్వసిస్తున్నాం. ఒకవేళ ఏవైనా పార్టీలు పొత్తు పెట్టుకోవాలనుకుంటే.. వారికి అధికారంలో భాగస్వాముల్ని చేస్తాం" అన్నారు.

సమ సమాజానికి కృషి.. అవినీతిపై పోరాటం

సభా వేదికపై ఆ పార్టీ నేత ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం పార్టీ సిద్ధాంతాలు, విధానాలను వివరించారు.. "పుట్టుకతోనే మనుషులంతా సమానం. సమ సమాజాన్ని సృష్టించడమే పార్టీ లక్ష్యం. దీంతో పాటు సెక్యులరిజం, రాష్ట్ర స్వయంప్రతిపత్తి, సమ్మిళిత అభివృద్ధి, ద్విభాషా విధానం, అవినీతిపై పోరాటం, తిరోగమన ఆలోచనల తిరస్కరణ, డ్రగ్స్ రహిత తమిళనాడు వంటివి ప్రధాన అంశాలు"గా పేర్కొన్నారు. అనంతరం మరో నేత కేథరిన్ మాట్లాడుతూ.. "మదురైలో సచివాలయం శాఖ ఏర్పాటు, కుల గణన , విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చేందుకు ఒత్తిడి చేయడం, గవర్నర్ పదవి రద్దుకు ప్రతిపాదన, మూడింట ఒక వంతు స్థానాలు మహిళలకు కేటాయించడం" వంటివి తమ లక్ష్యాలుగా పేర్కొన్నారు.

# డిజిటల్ అరెస్టుల వలలో పడకండి




**ప్రజలు ఒక్కక్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. 'క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి'.. అనే దాన్ని ఒక మంత్రంగా పాటిస్తే ప్రజలు ఆన్‌లైన్ స్కాముల వలనుంచి బయటపడవచ్చని సూచించారు.**

దిల్లీ: ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. 'క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి'.. అనే దాన్ని ఒక మంత్రంగా పాటిస్తే ప్రజలు ఆన్‌లైన్ స్కాముల వలనుంచి బయటపడవచ్చని సూచించారు. ఆదివారం 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ఆయన సైబర్ నేరాల తీవ్రత గురించి ప్రస్తావించారు. రాష్ట్రాల సహకారంతో దర్యాప్తు సంస్థలు ఈ బెడద నిర్మూలనకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని మోదీ తెలిపారు. డిజిటల్ మోసాలపై ఆందోళన వద్దని, అప్రమత్తతతో ఉంటే చాలని చెప్పారు. డిజిటల్ మోసాలు ఎలా జరుగుతాయో తెలిపే వీడియోను ఆయన ప్రదర్శిస్తూ.. దర్యాప్తు సంస్థలేవీ ఫోన్లు, వీడియో కాల్స్ ద్వారా ప్రజల్ని సంప్రదించబోవన్నారు.

మాటలతో టోపీ పెడతారు

'సైబర్ నేరగాళ్లు తమను రకరకాల హోదాలతో పరిచయం చేసుకుంటారు. పోలీసులమని, సీబీఐ అధికారులమని, నార్కోటిక్స్ విభాగ అధికారులమని, లేదంటే ఆర్‌బీఐ నుంచి మాట్లాడుతున్నామని చెబుతారు. నమ్మకం కలిగించేలా మాట్లాడతారు. ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మీకు ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు.

వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మీకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. మీకు అలా నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీయండి.




# ప్రముఖ వైద్యుడు జాల బాపురెడ్డి కన్నుమూత.

- కొంతకాలంగా లివర్ సెల్ క్యాన్సర్ తో ఇబ్బందులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 27**



జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యుడు జాల బాపురెడ్డి(75) అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుముశారు. గత కొంతకాలంగా లివర్ సెల్ క్యాన్సర్ తో బాపురెడ్డి బాధపడుతూ హైదరాబాద్ లో కన్నుమూశారు. జనరల్ ఫిజిషియన్ గా నాలుగు దశాబ్దాలు పైగా వైద్య సేవలందించారు. పూర్వపు కరీంనగర్ జిల్లా ఇల్లంతుకుంట మండలం అనంతగిరికి చెందిన బాపురెడి.. టీఆర్ఎస్ ( ప్రస్తుత బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. కేసీఆర్ కు అత్యంత ఆప్తుడిగా ఉన్న బాపురెడ్డి ఎన్నికల సమయంలో టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లారు. బీజేపీ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానిమంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు సమన్వయకర్తగా పని చేశారు. ఐఎంఏలో ను పదవులు అలంకరించారు. అత్యంక్రియలు సోమవారం హైదరాబాద్ లోని కొంపల్లిలో నిర్వహించనున్నారు.

# అలుపెరగని పోరాటాలకు సిద్ధం.

**సిపిఎం రాష్ట్ర నాయకులు టి. జ్యోతి, పాలడుగు భాస్కర్.**

**రెండవ రోజు కొనసాగిన సిపిఎం 23వ జిల్లా మహాసభలు.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 27:**

ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ అలుపెరుగని పోరాటాలకు సిద్ధం అవుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టీ. జ్యోతి, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం 23వ జిల్లా మహాసభల్లో బాగంగా రెండవ రోజైన ఆదివారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టి. జ్యోతి, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలను తీసుకురావడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అని అన్నారు. కేంద్రం మతోన్మాద దాడులను పెంచుతూ నిమ్న వర్గాలపై దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాకు ఇచ్చిన పసుపు బోర్డు హామీ ఏమైంది అని ప్రశ్నించారు. దీనికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దగ్గర సమాధానం లేదని అన్నారు. అదే విధంగా కేంద్రం నూతనంగా తీసుకోవచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయడంతో కార్మికుల పై పని భారం పెరుగుతుందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలను యుద్ధ ప్రాతిపదికనగా లెక్కించాలని అన్నారు. అదేవిధంగా దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరిందని, ఉద్యోగ కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు.

**ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు .**

ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ అమలు చేయకుండా అభాసు పాలవుతుందని అన్నారు. ఈ జిల్లాలో బీడీ పరిశ్రమ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, బీడి పరిశ్రమలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రతతో అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మానిఫెస్టోలో చేర్చిన బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించకపోవడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల ఆగ్రహాన్ని నిలవరించకపోతే తగిన గుణపాఠం కాంగ్రెస్ ప్రభుత్వంకు తప్పదని హెచ్చరించారు. ఈ మహాసభలో అనేక తీర్మానాలను ప్రవేశపెట్టి ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్ తో పాటు ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, జిల్లా నాయకులు, సుజాత, యేషల గంగాధర్, రామ్మోహన్ రావు, కొండ గంగాధర్, నన్నెసాహెబ్, విఘ్నేష్, జంగం గంగాధర్, ప్రజానాట్యమండల జిల్లా కార్యదర్శి సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను గుర్తించి ముందుకు సాగాలి !

తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేకంటే..రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అంటే బాగుంటుంది. యువకుడైన రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలసి చేస్తున్న పాలనాతీరు పట్ల ప్రజల్లో ఓ నమ్మకం..భరోసా పెరిగింది. బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు ఏవగింపు కలిగిలా...వారిని మరింత అసహ్యించుకునేలా చేస్తున్నాయి. చేసిన అప్పుల గురించి, అక్రమాల గురించి కాకుండా ఎదురు దాడితో చేస్తున్న విమర్శలు సామాన్యుల్లో బిఆర్ఎస్ వారిపట్ల మరింత అసహ్యం కలుగుతోంది. మేడిగడ్డపై కెసిఆర్ చేస్తున్న విమర్శలు చూస్తుంటే ఆయనలోని అసహనం బయటపడింది. మేడిగడ్డ కుంగిపోతే... బాధ్యతారహితంగా మాట్లాడారు. ఇంతకన్నా దారుణం ఉండదు. పదేళ్లు సిఎంగా చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం శోచనీయం. అసెంబ్లీకి రాకుండా టివిల్లో చర్చ చేస్తానని చెప్పడం ఆయన అసహనానికి పరాకాష్టగా చూడాలి. హరీష్‌రావు, కెటిఆర్, కవితలు కూడా చేస్తున్న విమర్శలు ప్రజల్లో ఇప్పుడు బాగా చర్చగా మారాయి. రచ్చబండ చర్చల్లో రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న హామీలపై బాగా చర్చ సాగుతోంది. ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు అన్నది గ్రామీణ ప్రాంతాల మహిళలకు వరంగా మారింది. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే సిలిండర్ కూడా మహిళలకు ఆర్థికంగా తోడ్పడే కార్యక్రమంగా చెప్పుకోవాలి. అందుకే బిఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర వ్యతిరేకత మొదలయ్యింది. గతంలో ఉన్న సానుభూతి కూడా పోగొట్టుకుంటున్నారు. మేమే తెలంగాణ తెచ్చామని ఇప్పటికీ చెప్పుకోవడం సిగ్గుచేటు. ప్రజలంతా కలిసి పోరాడితేనే తెలంగాణ వచ్చింది. కేవలం కెసిఆర్ పోరాడితే రాలేదని గుర్తించలేకపోతున్నారు. అధికారం పోవడంతో ఉండలేకపోతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి చేసుకుంది. డిసెంబర్ 7 సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తో పాటు, మంత్రులు కూడా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. అదేపనిగా బిఆర్ఎస్‌ను వారు విమర్శలు చేయడం లేదు. కేవలం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు విమర్శలపై మాత్రమే ఖండిస్తున్నారు. అప్పులు ఎలా జరిగాయో ప్రజలకు వివరిస్తున్నారు. ఇక వందరోజుల పాలన అంతా సజావుగా సాగుతోంది. అయితే ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి , ఆయన టీమ్ కేవలం వారు హామీ ఇచ్చిన పనులను మాత్రమే చేసి చూపారు. కానీ హామీ ఇవ్వని పనులు గ్రామాల్లో కోకొల్లలు. మంత్రులు ఎవరికి వారు వారి శాఖల్లో ఉన్న సమస్యలపై స్పందించాల్సి ఉంది. ప్రధానంగా పంచాయితీల్లో అంటే..గ్రామాల్లో ఇంటి వారసత్వం కొడుకులు లేదా కూతుళ్లకు బదిలీ అయ్యేది. తండ్రి చనిపోగానే ఓ తెల్ల కాగితం రాస్తే..బదిలీ చేశారు. ఈ పద్ధతిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తేసింది. గ్రామాల్లో ఇళ్లను కూడా తండ్రి మరణానంతరం బదిలీ చేసుకునేలా ఉన్న వెసలుబాటును పునరుద్ధరించాలి. గ్రామ పంచాయతీ స్థాయిలో అటెండర్ దగ్గర నుంచి ఇవో వరకు లంచాలు మేయనిదే పనులు చేయడం లేదు. దీనిని సీరియస్‌గా తీసుకుని కఠిన ఆదేశాలు ఇవ్వాలి. గ్రామస్థాయిలోనే ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రోత్సహించాలి. అవసరమైతే చట్టం చేయాలి. ప్లాస్టిక్, చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ మోరీల్లో, రోడ్లపై వేశాక..పారిశుద్ధ సిబ్బందితో ఎత్తివేయించడం కన్నా...వారు చెత్తా చెదారంతో పాటు ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయట వేయకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దీనిని తక్షణ కర్తవ్యంగా స్వీకరించాలి. ఇకపోతే గతంలో వైఎస్ అధికారంలో ఉన్నా తరవాత కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, పదేళ్ల కెసిఆర్ పాలనలో దేవాదాయ భూములు అన్యాకాంతం అయ్యాయి. కౌలుకు తీసుకున్న దేవాలయ భూములకు కౌలు చెల్లించడం లేదు. కొన్నిచోట్ల కౌలుదారులు ఎమ్మార్వోల ను మేనేజ్ చేసి తమ పేరున పట్టాలుగా రాయించుకున్నారు. ధరణిలో ఎక్కించుకున్నారు. ఇలాంటి భూములను స్వాధీనం చేసుకుంటే ధూపదీప నైవేద్యాలకు డబ్బులు విదల్చాల్సిన అవసరం రాదు. ఇకపోతే కోతుల భయంతో ప్రజలు గ్రామాల్లో పంటలు వేయాలంటే భయపడుతున్నారు. ఇళ్లల్లో పాదులు కూడా పెట్టుకోవడం లేదు. ఇంటిముందున్న చెట్లను నరికేస్తున్నారు. ఇళ్లకు గేట్లు వేసుకుని కూర్చుఉంటున్నారు. ఇది ఓ ప్రధాన సమస్యగా మారింది. కుక్కల బెడదీ తీవ్రంగా ఉంది. దీంతో పర్యావరణం దెబ్బతింటోంది. కోతుల బెడదను తొలగించేందుకు లేదా తరలించేందుకు మార్గాలను అటవీశాఖ ఆలోచన చేయాలి. ఇది యువతకు ఉపాధిగా కూడా మార్చవచ్చు. దీనిపై మంత్రి కొండా సురేఖ ఆలోచన చేయాలి. గ్రామాల్లో చెరువుల పూడికతీతలు ఎక్కడా జరగలేదు. మిషన్ కాకతీయ పేరుతో నిధులు మింగారు.

అలాంటి చెరువులను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో పునరుద్ధరించాలి. చెరువుల ఆక్రమణలను తొలగించాలి. గ్రామాల్లో పారిశుద్ధ్యం కూడా ముఖ్యంగా గమనించాలి. గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయాలి. నగరం నుంచి వెలపలకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు , సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాలి. ఇవన్నీ కొన్ని సమస్యలు మాత్రమే.

# ఇందూర్ జిల్లా.. క్రీడాకారులకు అడ్డా.

**క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సాహించడానికి కృషి.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**










**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 27:**

ఇందూర్ జిల్లా.. క్రీడాకారులకు అడ్డా అని, క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సాహించడానికి తన వంతుగా కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. జార్జియో బాటుమిలో జరిగిన ఓపెన్ ఇంటర్నేషనల్ ఉషు టోర్నమెంట్ సబ్ జూనియర్ కేటగిరిలో సిల్వర్, బ్రౌన్ మెడల్స్ సాధించిన ఆకాంక్ష యాదవ్, ఫారియా ఖాన్, సాయి దిక్షిత్ లను ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందూర్ జిల్లా అంటేనే క్రీడాలకు పుట్టినిల్లని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తెచ్చిన ఎండల సౌందర్య, నీఖిత్ జరీన, ఆనంద్ లాంటి వాళ్ళు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో కూడా రాణించడం వల్ల మానసికంగా, శారీరకంగా దృడంగా ఉంటారని అన్నారు. ఉషు క్రీడాలో మెడల్స్ సాధించిన ఆకాంక్ష యాదవ్, ఫారియా ఖాన్, సాయి దీక్షిత్ లు ఇంకా ఉన్నత శిఖరాలు అవరోదించాలని, కన్న తల్లి తండ్రులకు, ఇందూర్ జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చడానికి కృషి చేస్తున్న అబ్దుల్ ఓమర్ కోచ్ ను ప్రతేకంగా ఎమ్మెల్యే అభినందించారు.

# బీసీ కమిషన్ బృందానికి ఘన స్వాగతం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 27**





: తెలంగాణలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉమ్మడి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్న తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఆదివారం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద బీ.సీ కమిషన్ బృందానికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి,లు విచ్చేయగా, అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి తదితరులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా అధికారులతో భేటీ అయ్యి స్థానిక పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం బీసీ కమిషన్ బృందం సభ్యులు శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం సందర్శన కోసం బాసర పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణను పూర్తి చేసుకుని తిరిగి నిజామాబాద్ కు చేరుకోనున్న బీ.సీ కమిషన్ బృందం స్థానికంగా రాత్రి బస చేయనుంది. ఈ నెల 29 (మంగళవారం) ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి అభిప్రాయ సేకరణ జరుపనున్నారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 4.00 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాపై తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా కమిషన్ కు నివేదించవచ్చని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. స్వాగతం పలికిన వారిలో బీసీ అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

# ఆర్టిసి కార్గోలో హోం డెలివరీ సౌకర్యం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 27:**

తెలంగాణా రాష్ట్ర ఆర్టిసి కార్గో సేవా విభాగం ద్వార హోం డెలివరీ సౌకర్యం ప్రారంభించినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ కి సంబందించిన 31 కౌంటర్‌లలో(సిటీ పరిసరాలచుట్టూ) వస్తువులను కస్టమర్స్ కి హెూమ్ డెలివరీ అందించబడుతుందని, దీని ఆదివారం ప్రారంభించినట్టు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్నిసద్వినియోగంచేసుకోవాలని కోరారు.

**హెూం డేలివరీ రేట్లు**

0□1 Kg s`□□□ 50,
1□5 Kg s`□□□ 60,
5□10 Kg s`□□□ 65,
10□20 Kg s`□□□ 70,
20□30 Kg s`□□□ 75,
Above 30Kgs s`□□□ 75,
(Combination of slabs) గా ఉంటాయని వివరించారు.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: ఆర్మూర్ డిపో 7396889496, బోధన్ డిపో 9014296638, నిజామాబాద్-1 డిపో 9154298727, నిజామాబాద్-2 డిపో 7396889496, బాన్స్ వాడ డిపో 9154298729, కామారెడ్డి డిపో 9154298729, ఆర్. యం. ఆఫీసు 8639963647.

